ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

ఆదివారం 18 మే 2025

మౌలిక వసతులు కల్పిస్తాం

పరిశుభ్రత వైపు పటిష్ట అడుగులు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్



అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, మే 17(ఆంధ్రజ్యోతి): మౌలిక వసతులు కల్పించడంలో రాజీపడే ప్రసక్తే లేదని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శనివారం భూమి పూజ చేశారు. 27,28వ వార్డుల అభివృద్ధికి రూ.3.30 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీలకు భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల మౌలిక అవసరాలను తీర్చడంలో ఏ దశలోనూ రాజపడబోమన్నారు. పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు రూ.2.4కోట్లు విలువైన 39 చెత్తసేకరణ వ్యాన్లు, 12 ట్రాక్టర్లు మెటీరియల్ రికవరీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0 ప్రాజెక్టు కింద రూ.29 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టినట్టు మంత్రి వెల్లడించారు. విద్యుత్ స్తంభాలు, వీధిదీపాల కొరతపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎర్రగుంట్లలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. గాంధీనగర్‌లో నిర్వహించిన బటర్‌ఫ్లై ఫొటోషూట్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఏపీసీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కాటమయ్య, నాయకులు అంబటి సతీశ్, కిష్ట, జింకా చంద్ర, గొట్లూరు చంద్ర, ఓబుళేసు, రాజు, నబీరసూల్, జమీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో మినీ సందడి



● నేటి నుంచి నియోజకవర్గాల్లో మినీ మహానాడు ● ఏర్పాట్లలో నాయకులు బిజీబిజీ



మినీ మహానాడు కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం చేసిన దృశ్యం

హిందూపురం, మే 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో మినీ మహానాడు సందడి మొదలైంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి జరుగుతున్న మహానాడు సభలు కావడంతో విజయవంతం చేసేందుకు నియోజకవర్గ బాధ్యులు కృషి చేస్తున్నారు. కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి ఓవైపు ఏర్పాట్లు జరుగుతుండగా అందుకు సన్నాహకంగా నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిలో మినీ మహానాడులు నిర్వహించేందుకు ఎక్కడికక్కడ నియోజకవర్గ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు మహానాడు జరగనున్న విషయం తెలిసిందే. అందుకు సన్నాహకంగా ఆదివారం నుంచి మూడు రోజుల పాటు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో మినీమహానాడు సభలు జరగనున్నాయి. పార్లమెంట్, జిల్లా స్థాయిలో ఈ నెల 23,24 న మహానాడు సభలు జరగనున్నాయి. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యులు మినీ మహానాడు తేదీలను ప్రకటించారు. మినీ మహానాడులో నియోజకవర్గంలోని ముఖ్య సమస్యలపై మాట్లాడి వాటికి సంబంధించిన తీర్మానాలను చేస్తారు. వీటిని రాష్ట్ర మహానాడుకి నివేదిస్తారు.

మొదలైన సంస్థాగత సందడి

మినీ మహానాడులకు ముందే పార్టీలో సంస్థాగత ఎన్నికలను పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే గ్రామ వార్డు స్థాయిలో ఎన్నికల ప్రక్రియ తుది దశలో ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో దాదాపు పూర్తి కావచ్చింది. ఆదివారం లోపు పట్టణ, మండల కమిటీలతో పాటు అనుబంధ సంఘాల కమిటీలు నియామక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించడానికి రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా వరకు పరిశీలకులను పార్టీ అధిష్టానం నియమించింది. ఎన్నికల్లో కష్టపడిన వారికి అనుబంధ సంఘాల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. బూత్‌క్లస్టర్ స్థాయిలో ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనే నాయకులకు పదవులు కేటాయించే అవకాశం ఉంది. పార్టీ అధికారంలో ఉండటంతో పదవులకు పోటీ ఎక్కువగా ఉంది. దీని వలన కొన్ని చోట్ల ఎమ్మెల్యేలకు తలనొప్పి ఏర్పడుతోంది.



పలు అంశాలపై చర్చ

అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే మినీ మహానాడు సమావేశాల్లో మొదటగా పార్టీ ఆవిర్భావం, సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సంక్షోభాలు, నాయకులకు ఎదురైన ఆటుపోట్లు వంటి విషయాలను తెలియజేయనున్నారు. దీనితో పాటు ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, ఫలితాలు, ఇతర రాజకీయ పార్టీల దాడులను తిప్పికొట్టిన అంశాలను చర్చిస్తారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు ఏ విధంగా సిద్ధం కావాలి?. అప్పుడు ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో కూడా చర్చించనున్నారు. ఆఖరిగా రాష్ట్ర మహానాడు కార్యక్రమం విజయవంతంపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

నేడు పురంలో మినీ మహానాడు

అసెంబ్లీ నియోజకవర్గాల్లో మినీ మహానాడును ఘనంగా నిర్వహించడనికి నాయకులు సిద్ధమవుతున్నారు. ఈక్రమంలోనే హిందూపురంలో నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు జేవీఎస్ ఫంక్షన్ హాలులో జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో నాయకులు నిమగ్నమయ్యారు. ఐదు వేల మంది టీడీపీ శ్రేణులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. అంతకు తగ్గట్టుగా ఏర్పాట్లును పూర్తి చేశారు.

విత్తనం ఏదీ?



వేరుశనగ సాగుకు సమీపిస్తున్న గడువు

సబ్సిడీ ధరలను ఖరారు చేయని ప్రభుత్వం

విత్తన పంపిణీ కోసం రైతుల ఎదురుచూపు



పొలాన్ని దుక్కి దున్నుతున్న రైతు

తనకల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో మెట్ట రైతులు సేద్యపు పనుల్లో నిమగ్నమయ్యారు. పనులు పూర్తికాగానే పదును వాన కురిస్తే వేరుశనగ విత్తడానికి సమాయత్తం అవుతున్నారు. అయితే అన్నదాతలను విత్తన కొరత వేధిస్తోంది. ప్రతి ఏటా ప్రభుత్వం సబ్సిడీతో విత్తన వేరుశనగ సరఫరా చేసేది. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు విత్తన వేరుశనగ సబ్సిడీని కూడా ప్రకటించలేదు. దీంతో ఈ సారి విత్తన వేరుశనగ పంపిణీ చేస్తారో లేదోనన్న ఆందోళన రైతుల్లో నెలకుంది. మండలంలోని కొన్నిగ్రామాల్లో ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసి, ముందస్తు వర్షాలు వస్తే శాస్త్రవేత్తలు చెప్పిన ప్రకారం జూన్ 15లోపు వేరుశనగ విత్తడానికి సిద్ధమవుతున్నారు.

సమీపిస్తున్న అదును

ప్రతిఏటా ప్రభుత్వం మే 15, 20 తేదీలకల్లా పంపిణీకి విత్తన వేరుశనగ సిద్ధంగా ఉంచేది. ఈ ఏడాది వేరుశనగ విత్తుకోవడానికి అదును సమీపిస్తున్నా ప్రభుత్వం సబ్సిడీ ధరలు ప్రకటించలేదు. ప్రభుత్వం విత్తన ధరలను త్వరగా ప్రకటిస్తే ఎన్ని ఎకరాల్లో వేరుశనగ సాగుచేయడానికి నిధులు సమకూర్చగలమో తమకు ఒక అంచనా వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

విత్తన వేరుశనగ ధరలు తెలిస్తే మిగిలిన భూమిలో ప్రత్యామ్నాయ పంటలైన కంది, జొన్న, కొర్రలు, సాములు, బరిగేలు, సజ్జలు, అలసంద, అనప, పెసర, ఆముదం, తదితర పంటలు సాగుచేయడానికి విత్తనాలను సమకూర్చుకోవాలని ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారుల నుంచి ఎలాంటి ప్రకటనలు వెలువడకపోవడంతో రైతులు ఒకింత ఆందోళన, ఆగ్రహానికి గురవుతున్నారు. అదును సమీపిస్తుండటంతో విత్తనకాయలు ఎప్పుడు కొనుగోలు చేయాలి, ఎప్పుడు సిద్ధం చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. మండల వ్యాప్తంగా 20వేల ఎకరాల్లో పంటలు సాగు చేయాల్సి ఉంది. ప్రతిఏటా 10 వేల నుంచి 12వేల ఎకరాల్లో రైతులు వేరుశనగ సాగుచేస్తున్నారు. అయితే ఈ ఏడాది ముందస్తు వర్షాలు మురిపిస్తుండటంతో వేరుశనగ విస్తీర్ణం పెరిగే అవకాశమున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

పాతిక రోజులే సమయం



జూన్ రెండో వారం నుంచి జూలై 15లోపు వేరుశనగ సాగుచేస్తే, మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విత్తు వేయడానికి పాతిక రోజులే సమయముంది. ఇంకా ప్రభుత్వం సబ్సిడీ విత్తనకాయలు సరఫరా చేయలేదు. ధరలు ప్రకటించలేదు. మరి పంపిణీ ఎప్పుడో తెలియకుంది. ప్రతిఏటా ఐదు ఎకరాల్లో సాగు చేసేవాడిని, ఈఏడాది ఇంకా సాగు విస్తీర్ణం పెంచాలను కుంటున్నా. గవర్నమెంట్ రేటు చెబితే ఎన్ని ఎకరాల్లో సాగుచేసేది నిర్ణయించుకుంటాం.

- మల్లిరెడ్డి, రైతు, గందోడివారిపల్లి

ఎప్పుడిస్తారో ఏమో..?: ఆదెప్ప, రైతు, పడమటివారిపల్లి



ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ కాయలు ఎప్పుడిస్తుందో ఏమో ఇంకా తెలియడం లేదు. శెనిక్కాయలు కొనుగోలు చేయాలి. వాటిని వలచాలి, శుభ్రం చేయాలి. పంపిణీ ఆలస్యమైతే మంచి కార్తెలు దాటిపోతాయి. వెంటనే ప్రభుత్వం వేరుశనగ విత్తనకాయలను సరఫరా చేయాలి. సకాలంలో విత్తనకాయలు అందకపోతే చిరుధాన్యాలైనా సాగు చేసుకుంటాం.

చిరుధాన్యాలు పంపిణీ చేయాలి



ప్రభుత్వం వేరుశనగ విత్తనాలకు సబ్సిడీ ప్రకటించినప్పుడు చిరు, నవ ధాన్యాలకు కూడా ధరలు నిర్ణయించి సకాలంలో పంపిణీ చేయాలి. గతంలో మన విత్తన కేంద్రాల ద్వారా వాటిని సకాలంలో పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం వేరుశనగ కాయలిచ్చి చేతులు దులుపుకుంటోంది. వేరుశనగ విత్తన కాయలతోపాటు నవ, చిరుధాన్యాలు పంపిణీ చేస్తే, సాగు విస్తీర్ణం పెరుగుతుంది.

- వీవీరమణ, రైతు సంఘం నాయకులు, తనకల్లు

నివేదికలు పంపాం



మండల వ్యాప్తం గా గత మూడేళ్లలో వేరుశనగ సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసి, వాటి ఆధారంగా మండలానికి 6,200 క్వింటాళ్ల విత్తన వేరుశనగ అవసరం ఉందని ప్రభుత్వానికి నివేదికలు పంపాం. నవ, చిరుధాన్యాలను అడుగగా, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

- శ్రీహరినాయక్, ఏఓ, తనకల్లు

మన సైనిక సత్తా ప్రపంచానికి చాటాం

● తిరంగా ర్యాలీలో వక్తలు



పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి భారత త్రివిధ దళాల సత్తా చాటామని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యాన్ని పురస్కరించుకుని త్రివిధ దళాలకు మద్దతుగా జిల్లా కేంద్రంలో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ హనుమాన్ కూడలి నుంచి విద్యాగిరి వరకు సాగింది. ఈర్యాలీలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొని మాట్లాడారు. భారతదేశం సైనికశక్తిలోనే కాదు ఆర్థిక శక్తిలో కూడా దూసుకుపోతోందన్నారు. 2047నాటికి ప్రపంచంలో నంబర్ వన్‌గా ఎదగడం తథ్యమన్నారు. పహల్గాం వంటి ఘటనలు పునరావృతం కాకుండా భారత దళాలు సాగించిన పోరాటం అమోఘమన్నారు. ప్రపంచం గర్వించదగ్గ మనసైనిక దళాలకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. ఉగ్రవాదంపై మన రక్షణ దళాలు చేస్తున్న పోరాటానికి మద్దతుగా దేశమంతా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మనప్రాంతానికే చెందిన అగ్నివీర్ మురళీనాయక్ త్యాగం ప్రతిఒక్క భారతీయుడికి స్ఫూర్తి దాయకమన్నారు. ర్యాలీలో పాల్గొన్న పట్టణవాసులు అమరవీరులకు జోహార్, భారత్ మాతా కీజై, వందేమాతరం అంటూ నినదించారు. అనంతరం జాతీయగీతాలాపనతో జెండావందనం గావించారు. ర్యాలీలో కూటమినాయకులు పత్తిచంద్రశేఖర్, రామాంజనేయులు, పీసీగంగన్న, బెస్తచలపతి, సామకోటి ఆదినారాయణ, మహమ్మద్‌రఫీ, రామారావు, లక్ష్మీపతి, గంగాధర్‌నాయుడు, ఓబులేసు, మాలమనోహర్, ఉమాపతి, శ్రీరాములు,బీజేపీ నాయకులు లాయర్ హరికృష్ణ, జ్యోతిప్రసాద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే భవిష్యత్తు నిర్మాతలు

సాంకేతిక సవాళ్లను అధిగమించాలి

గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

అట్టహాసంగా జేఎన్టీయూ స్నాతకోత్సవం

6



అభివృద్ధి కోసమే సైకిల్ ఎక్కారు

● ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మే 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో 13మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. వీరందరికి టీడీపీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధి ఆగిపోవడంతో వైసీపీ కౌన్సిలర్లే మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి తొలగించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఒక పార్టీ, స్థానికంగా ఒక పార్టీ ఉండటం వల్లే అభివృద్ధికి విఘాతం కలుగుతోందని ఆలోచించిన వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరినట్లు పేర్కొన్నారు. పార్టీలో చేరినవారందరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. 19న మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్ల ఎన్నిక సాఫీగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.



టీడీపీలో చేరిన కౌన్సిలర్లతో ఎమ్మెల్యే కందికుంట

రైతన్నకు చేయూత..!

● అన్నదాతా సుఖీభవ అమలుకు కసరత్తు ● ఖరీఫ్‌కు ముందే రైతుకు పెట్టుబడి సాయం ● పీఎం కిసాన్‌తో కలిపి ఇచ్చేందుకు సమాయత్తం ● ఈనెల 21లోగా అర్హుల జాబితా తయారీ

పుట్టపర్తి/రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రతి ఏటా కేంద్రం మూడు విడతల్లో ఇచ్చే పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో కలిపి ప్రతి రైతులకు రూ.20 వేలు ఇవ్వడానికి సమాయత్తమవుతోంది. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే నగదు అందించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇటీవల జరిగిన టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశంలో కేంద్రం రైతుల ఖాతాల్లోకి నిధుల వేసిన రోజే రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ కింద జమ చేయాలని నిర్ణయించారు. ఈనెల 21లోగా లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అర్హుల గుర్తింపు ప్రక్రియ వేగంగా సాగుతోంది.



ఈనెల 21లోగా అర్హుల జాబితా

జిల్లాలో 3.20లక్షల హెక్టార్లులో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ కింద అర్హులను ఎంపిక చేయడానికి వ్యవసాయ శాఖ రైతు సేవా కేంద్రాల వారిగా వెబ్‌ల్యాండ్ డేటాను గ్రామ వ్యవసాయ సహాయకులతోపాటు ఏవోల లాగిన్లకు ఇచ్చింది. జిల్లాలో 421198 ల్యాండ్ రికార్డుల్లో ఇప్పటికే 295582 రికార్డుల పరిశీలన పూర్తి చేశారు. మిగిలిన రికార్డుల పరిశీలన గడువులోగా పూర్తి చేయాలని కసరత్తు చేస్తున్నారు. కుటుంబం యూనిట్‌గా ఈపథకాన్ని అమలు చేస్తారు. పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందని ఈనెల 21లోగా పూర్తి చేస్తామని, అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో కలిపి వర్తింపజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు.

పీఎం కిసాన్ పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి

రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి యోజన అందాలంటే లబ్ధిదారులు తప్పనిసరిగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయించుకోవాలి. అలా చేయించుకుంటేనే పథకానికి అర్హులవుతారు. ఈకేవైసీ చేసుకోవడానికి మూడు మార్గాలున్నాయి ఇందులో ఆన్‌లైన్ ద్వారా పీఎం కిసాన్ పోర్టల్‌లోకి వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలి. ఓటీపీ ధ్రువీకరణద్వారా ఈకేవైసీ చేసుకోవచ్చు, ఈకామన్ సర్వీసు సెంటర్ల ద్వారా, బయోమెట్రిక్‌తో కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. పీఎం కిసాన్ మొబైల్‌యాప్ ద్వారా ఫేస్ అథెంటికేషన్‌తో కూడా ఈకేవైసీ చేసుకోవచ్చు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 2.62 లక్షలమంది రైతులు ప్రస్తుతం పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నట్లు తెలిసింది. ఏటా లబ్ధిదారుల సంఖ్య తగ్గుతోంది. ఇందుకు ప్రధాన కారణం పలువురు చనిపోవడం, కొత్త వారు నమోదుకావకపోవడంతో ఈపరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో కొత్తగా నమోదుకు అవకాశం కల్పిస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



మాట్లాడుతున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్




గోల్డ్ మెడల్, పీహెచ్‌డీ పొందిన వారి ప్రతిజ్ఞ


స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు, జనం

విద్యార్థులే భవిష్యత్తు నిర్మాతలు

సాంకేతిక సవాళ్లను అధిగమించాలి
గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
అట్టహాసంగా జేఎన్టీయూ స్నాతకోత్సవం

అనంతపురం సెంట్రల్, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులే భవిష్యత్ తరాల నిర్మాతలు అని గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు. జీరోను కనుగొన్న ఆర్యభట్టు నుంచి భౌతికశాస్త్ర నోబెల్ బహుమతి గెలుచుకున్న తొలి ఆసియావాసి సీవీ రామన్ వరకు భారతదేశం ఆవిష్కర్తల నిలయమని పేర్కొన్నారు. శనివారం జేఎన్టీయూఏలో 14వ స్నాతకోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు అధ్యక్షతన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్నాతకోత్సవానికి యూనివర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు ముఖ్య అతిథిగా ఐఐటీ కాన్పూర్ విశ్రాంత ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ హాజరయ్యారు. ముందుగా హైదరాబాద్ లారస్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ సత్యనారాయణ చావాకు గవర్నర్ అబ్దుల్ నజీర్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తరువాత 41 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, 40,109 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ.. వర్తమాన ఇంజనీర్లు, ఆవిష్కర్తలు, భవిష్యత్తు నిర్మాతలు, నాయకులు మీరేనని విద్యార్థులకు సూచించారు.

వ్యవస్థాపకులుగా రాణించేందుకు సొంత ప్రణాళికలు రూపొందించుకుని దేశానికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారాలను కనుగొడం వ్యవస్థాపక లక్షణాలని తెలిపారు. ఈ అంశానికి దోహదపడేలా అమరావతి హబ్-అండ్ స్పోక్ మోడల్ అనుసంధానంగా జేఎన్టీయూలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల్లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ విద్యలో అసాధారణమైన విద్యనందిస్తూ రాష్ట్రంలో జేఎన్టీయూ అగ్రశ్రేణిగా నిలిచిందని అన్నారు. శాస్త్ర, సాంకేతిక సవాళ్లను అధిగమించి, మానసిక సామర్థ్యాన్ని ప్రదర్శించాలన్నారు. మీ అభిరుచుల సాధనలో నిర్భయంగా ఉండాలని, ఏ వైఫల్యం మిమ్మల్ని నిరుత్సాహపరచనివ్వకూడదని హితవు పలికారు. విజయంతో సంతృప్తి చెందవద్దని, వినయంతో ముందుకు నడవాలని, జేఎన్టీయూ ఘనతను చాటాలని విద్యార్థులకు గవర్నర్ పిలుపునిచ్చారు.

విమర్శనాత్మకంగా ఆలోచించాలి
-ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్



జ్ఞానాన్ని పెంపొందించుకోవడమే విద్య ఉద్దేశంకాదని, విమర్శనాత్మకంగా ఆలోచించడం, నైతికంగా వ్యవహరించడం ముఖ్యమని ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ పేర్కొన్నారు. తక్కువతో ఎక్కువ చేయగలమని ఏఐ, చాట్‌జీబీటి నిరూపిస్తున్నాయని వివరించారు. వంద మిలియన్ల వినియోగదారులను చేరుకోవడానికి మొబైల్ ఫోన్‌కు 30 సంవత్సరాలు పట్టిందన్నారు. చాట్‌జీబిటికి రెండు నెలలు మాత్రమే పట్టిందన్నారు. చాట్‌జీబీటిలో 20కి ఒకటో వంతు ఖర్చుతో డీప్‌సీక్‌ను చైనా తీసుకువచ్చిందని అన్నారు. తాను మొదటిసారి సివిల్ ఇంజనీర్‌గా పనిచేసే సమయంలో గృహనిర్మాణ ఖర్చులో 80శాతం మెటీరియల్ ఖర్చు, 20 శాతం ఇంటీరియర్ ఖర్చు అయ్యేదన్నారు. నేడు 20 శాతం నిర్మాణానికి, 80 శాతం ఇంటీరియర్‌కు ఖర్చుచేయాల్సి వస్తోందని అన్నారు. ముద్రించిన పుస్తకాన్ని చూడకుండానే ప్రసంగించారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సవిత

అనంతపురం అర్బన్ మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పలువురు ప్రముఖులు ఘనంగా స్వాగతం పలికారు. శనివారం జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి హాజరయ్యేందుకు జిల్లాకు వచ్చిన గవర్నర్‌ను స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత జ్ఞాపికను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్‌లాల్, కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ పాల్గొన్నారు.

జేఎన్టీయూకు న్యాక్, ఎన్‌బీఏ ర్యాంకులు

వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు



జేఎన్టీయూకు న్యాక్ ఏ గ్రేడ్‌ను, అన్ని పీజీ ప్రోగ్రామ్‌లకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ నాణ్యత, భద్రత, పర్యావరణం అంశాల్లో ఐఎస్ఓ సర్టిఫికేషన్లు పొందామని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 801-1000, భారత దేశంలో 25వ స్థానం, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో జేఎన్టీయూఏ నిలిచిందని పేర్కొన్నారు. క్యూఎస్ ఆసియా ర్యాంక్ 651-700, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ 151-200 (ఇంజనీరింగ్), 51-100(స్టేట్ పబ్లిక్) ర్యాంకులు సాధించామని తెలిపారు. వివిధ ఏజెన్సీల నుంచి రూ.367 లక్షలకు పైగా ప్రాజెక్ట్ గ్రాంట్లను పొందామని అన్నారు. ఆవిష్కరణల ఫలితంగా ఈఈజీ ప్రాసెసర్లు, కాంక్రీట్ టెక్నాలజీలు, శక్తి పరికరాలను కవర్ చేసే పేటెంట్లు లభించాయన్నారు. తాజాగా 33 పేటెంట్లను అధ్యాపకులు ప్రచురించారని వివరించారు. డిగ్రీలో ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడంలో నిబద్ధతకు గుర్తింపుగా మేకింగ్ ఇండియా ఎంప్లాయిబుల్ అవార్డు లభించిదని అన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎస్‌వీ సత్యనారాయణ, ఏఐసీటీఈ విశిష్ట నిపుణులుగా మూడు సంవత్సరాల పదవీకాలానికి గుర్తింపు పొందారన్నారు. అదేవిధంగా పలువురు ప్రొఫెసర్లకు అవార్డులు లభించాయన్నారు. ఈ సంవత్సరం 40,109 డిగ్రీలను ప్రదానం చేశామని, వీటిలో 30,017 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను, ఎంటెక్, ఎం ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ పూర్తిచేసిన 9,564 మంది విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు, 361 మందికి ఫార్మా-డి పట్టాలు, 167 మందికి పీహెచ్‌డీలను ప్రదానం చేశామని తెలిపారు. మెరుగైన ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 41 బంగారు పతకాలను ప్రదానం చేశామన్నారు. వీటిలో 27 పతకాలను మహిళలు సాధించారని, ఇది నారీశక్తికి నిదర్శనమన్నారు. నాలుగు మెడల్స్‌ను పొందిన తయ్యూరు సుప్రజ, ఆరు మెడల్స్‌ను సాధించిన నంద్యాల పూజిల్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.

విధుల్లో కలెక్టర్ బిజీబిజీ



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పర్యటను విజయంతం చేసేందుకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మూడురోజుల నుంచి శ్రమిస్తూవచ్చారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంచేస్తూ గర్నర్ పర్యటన ఏర్పాట్లను పూర్తిచేయించారు. శనివారం ఉదయం రైల్వేస్టేషన్‌లో గవర్నర్‌కు స్వాగతం పలికి రోడ్లు, భవనాల అతిథిగృహానికి క్యాన్వాయ్‌తో వెళ్లారు. అక్కడి నుంచి గవర్నర్‌తోపాటే జేఎన్టీయూ స్నాతకోత్సవానికి వచ్చారు. కాన్వొకేషన్ ప్రారంభంకాగానే గవర్నర్ అబ్దుల్ నజీర్ వేదికను అలకరించారు. అనంతరం కలెక్టర్ తన ల్యాప్‌టాప్ ద్వారా ఈఆఫీస్ వంటి కార్యకలాపాల విధుల్లో నిమగ్నమయ్యారు.

పటిష్ట బందోబస్తు...

జేఎన్టీయూ స్నాతకోత్సవానికి హాజరైన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. గత రెండు స్నాతకోత్సవాలకు జిల్లాకు వచ్చిన సందర్భంకంటే ఈ సారి బందోబస్తు పెంచారు. దాదాపు 1.30 గంటల సేపు గవర్నర్ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. నిమిషం ఆలస్యం చేయకుండా ప్రణాళికబద్ధంగా కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

'పట్ట'రాని సంబరం...!



జేఎన్టీయూ స్నాతకోత్సవంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఎన్టీఆర్ ఆడిటోరియం సంబరాలతో మునిగిపోయింది. సంవత్సరాల తరబడి చదివిన ఫలితంగా గవర్నర్ అబ్దుల్ నజీర్, వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు చేతుల మీదుగా పట్టాలను అందుకున్న వేళ ఆనందంతో పులకించిపోయింది. డిగ్రీలను చేతబట్టుకుని వెళ్లేందుకు వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. మెడల్స్‌ను సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి బంగారు పతకాలను ముద్దాడుతూ మురిసిపోయారు. ప్రతిభకు తగిన గౌరవాన్ని ఇచ్చిన జేఎన్టీయూ.. జీవితకాలం స్థిరంగా నిలిపోయే అనుభూతిని ప్రసాదించిందని ఆనందాలను పంచుకున్నారు.



పూజిత కుమార్ రెడ్డికి పతకం బహుకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్


షేక్ షాజిద్ మురద్, సబియా సుల్తానా, మొహ్మద్ అక్రమ్, వెంకట కార్తీక్, రమ్యలక్ష్మి, లక్ష్మిప్రియ, అఖిల, నాగమణి, భవిత


నాగేంద్రబాబు, హర్షిత, అభినయన, లికితరెడ్డి, వాల్మీకి హరిత, ఫాహిద్ అలి, వనతి, శ్రీవైష్ణవి, తయ్యూరు సుప్రజ, జాహ్నవి, సునీత, అమృత్‌బాబు


భవ్యశ్రీ, మహిత, గ్లిసియ, వాసంతి


పీహెచ్‌డీలు సాధించిన విద్యార్థులకు పట్టాల ప్రదానం



ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ


మేము సైతం...



సైనికులకు బాసటగా

నిలుద్దాం

- రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పాం
- రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్
- అనంతలో భారీ తిరంగా ర్యాలీ

ఆర్ట్స్ కళాశాల మైదానంలో మాట్లాడుతున్న మంత్రి కేశవ్



జాతీయ జెండాలతో భారీర్యాలీ →



అనంతపురం అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): సైనికుల శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుద్దామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా అనంతపురం నగరంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. శనివారం ఉదయం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న మైదానం నుంచి క్లాక్ టవర్ మీదుగా సప్తగిరి సర్కిల్ సమీపంలోని జెండా స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీలకు అతీతంగా ప్రజా సంఘాల నాయకులు, మాజీ సైనికులు, విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు, టీచర్లు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలో భాగస్వాములయ్యారు. ర్యాలీ పొడవునా జాతీయ జెండాలు రెపరెపలాడాయి. సప్తగిరి సర్కిల్ సమీపంలో జాతీయ జెండా స్తంభం వద్ద జాతీయ గీతాలాపన చేసి ర్యాలీని ముగించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంటకశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, అహూడా చైర్మన్ టీసీ వరుణ్, ఇతర ప్రజాప్రతినిధులు తిరంగ ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండాను చేతపట్టుకొని భారత్ మాతాకీ జై అంటూ పెద్ద ఎత్తున నినదించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, డీవీఈఓ వెంకటరమణనాయక్, డీఈఓ ప్రసాద్‌బాబు, డీఎంహెచ్ఓ దేవి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు సరిపూటి సూర్యనారాయణ, ఎద్దులపల్లి సుబ్రహ్మణ్యం, బాంబే డయింగ్ నాగన్న, రాయల్ మురళీ, సింగవరం రవి, గంగారామ్, తలారి ఆదినారాయణ, దండు శ్రీనివాసులు, తెలుగు మహిళలు స్వప్న, సంగా తేజస్విని, చరిత తదితరులు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీ గర్వకారణం

దేశ సరిహద్దుల్లో ప్రాణాలను అడ్డేసి నిలిచిన సైనికులకు, సైనిక శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుస్తూ దేశం మొత్తం తిరంగ ర్యాలీ జరుపుకోవడం గర్వకారణం. దేశం ఒక్కటే అన్న విషయం మన గుండెచప్పుడని ఈ రోజు అర్థం అవుతోంది. ఇంత ఉదయాన్నే వేలాది మంది ర్యాలీకి హాజరయ్యారంటే దేశభక్తి ప్రతి ఒక్కరి గుండె చప్పుడుగా మారిందనేందుకు ఇదే నిదర్శనం. గోరంట్ల మండలానికి చెందిన వీరజవాన్ మురళీనాయక్ యుద్ధంలో ప్రాణాలు అర్పించారు. సైనికులకు బాసటగా నిలవాల్సిన అవసరం ఉంది. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో తిరంగ ర్యాలీలో మనం అందరం భాగస్వామ్యులం కావడం గర్వించదగ్గ విషయం.

- పయ్యావుల కేశవ్, ఆర్థికశాఖ మంత్రి

సిందూర్‌తో పాకిస్థాన్‌కు సమాధానం



పహల్గాం ఉగ్రదాడిలో అమాయకులైన పర్యాటకులపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు 26 మందిని పొట్టనబెట్టుకున్నారు. ఈ ఘటనతో దేశమంతా బరువెక్కింది. ప్రతి భారతీయుడి కళ్లు ఎరుపెక్కాయి. మనందరి మనోభావాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా మన సైన్యం, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గట్టిగా సమాధానం చెప్పారు. మనదేశంలో అమాయకులపై దొంగ చాటుగా దెబ్బతిస్తే.. మనం ముందుగానే చెప్పి ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేశాం. మురళీ నాయక్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోతే మనమంతా అంత్యక్రియల్లో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించామన్నారు.

- సత్యకుమార్ యాదవ్, వైద్యఆరోగ్య శాఖ మంత్రి

మనమంతా అండగా ఉన్నాం



ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీని చేపట్టాం. నగర ప్రజలు, మహిళలు, యువత, ఎన్జీవోలు, సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు, వ్యాపార సంస్థలు, టీచర్లు, అన్ని వర్గాలు స్వచ్ఛందంగా తిరంగా ర్యాలీలో భాగస్వామ్యులు కావడం గర్వకారణం. ఈ ర్యాలీలో పాల్గొనడం ద్వారా సైనికులకు మనమంతా అండగా ఉన్నామని తెలియజేశాం.

- వినోద్‌కుమార్, కలెక్టర్

పాకిస్థాన్‌కు దీటుగా సమాధానం



పహల్గాం దాడిని నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్ ఉగ్రవాదులకు మన సైన్యం దీటుగా సమాధానం చెప్పింది. భవిష్యత్‌లో ప్రపంచపటంలో మీ పేరు కూడా లేకుండా చేస్తామనే రీతిలో మన సైన్యం పాకిస్థాన్‌కు సమాధానం చెప్పింది. భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని ప్రపంచ దేశాలకు తెలియజేశారు.

- లక్ష్మీనారాయణ, ఎంపీ

మనసైన్యం సత్తా చాటింది



పహల్గాం తరహాదాడులు పునరావృతమైతే ఆపేరేషన్ సిందూర్ లాంటివి కూడా పునరావృతమవుతాయని మన సైన్యం చేతల్లో చూపించింది. దేశ ప్రజల తరఫున సైన్యానికి సెల్యూట్ చేస్తున్నాం. ఆపరేషన్ సిందూర్‌తో మన ఆర్మీ శక్తి ఏంటో ప్రపంచానికి తెలిసింది. పాకిస్థాన్ పౌరులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ఉగ్రవాదులే లక్ష్యంగా మన సైన్యం దాడులు చేసింది.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్యే

పట్టపగలే ఇంట్లో చోరీ


బీరువాలో ఉన్న బంగారు నగలు ఎత్తుకెళ్లిన దుండగులు

గుంతకల్లు టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్జీవన్ రామ్ కాలనీలో నివాసముంటున్న చెరుకు బండి ఫక్రుద్దీన్ ఇంట్లో శనివారం మధ్యాహ్నం ఇంట్లో చోరీ జరిగింది. వివరాల మేరకు.. ఫక్రుద్దీన్ ఉదయం చెరకు బండి పనికి వెళ్లాడు. అతడి భార్య బషీరున్నీసా చర్చి స్కూల్‌లో పనికి వెళ్లింది. వారి ఇద్దరు కుమారులు కూడా పనికి వెళ్లారు. పిల్లవాడికి ప్రభుత్వ ఆసుపత్రిలో టీకాలు వేయించేందుకు కోడలు, కూతురు ఇంటికి తాళం వేసి.. కిటికి వద్ద ఉన్న డబ్బా కింద తాళం చెవులు పెట్టి వెళ్లారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. దుండగులు బీరువాలో ఉన్న ఎనిమిదిన్నర తులాల బంగారు నగలు, ఆరు తులాల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారన్నారు. తన మనవడి నామకరణం ఫంక్షన్ కోసం తన కుమార్తె కదిరి నుంచి ఈనెల 13న వచ్చిందన్నారు. తన కూతురు బీరువాలో పెట్టిన ఎనిమిదిన్నర తులాల బంగారు నగలను దుండగులు ఎత్తుకెళ్లారని ఫక్రుద్దీన్ వాపోయాడు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఫక్రుద్దీన్ తెలిపాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

వడదెబ్బతో టీడీపీ కార్యకర్త మృతి


శ్రీనివాసులు (ఫైల్)

బెళుగుప్ప, మే 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త వీరాపురం శ్రీనివాసులు(42) శనివారం వడదెబ్బతో మృతి చెందాడు. తీవ్ర అస్వస్థతతో ఉన్న ఆయన్ను కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య రాధికా, కూతుర్లు లావణ్య, వెన్నెల సంతానం గలదు.

లారీ దగ్ధం.. రూ. 4 లక్షల నష్టం


దగ్ధమవుతున్న లారీ

గార్లదిన్నె, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఓ లారీ దగ్ధమయ్యింది. వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన లారీ నెల్లూరు జిల్లా కృష్ణపట్నం నుంచి శుక్రవారం రాత్రి 8 గంటలకు సన్‌ఫ్లవర్ అయిల్ లోడుతో బయలుదేరి శనివారం ఉదయం 8 గంటలకు అనంతపురంలో ఆన్‌లోడు చేసింది. అనంతరం కర్ణాటకలోని రాయచూరుకు బయలుదేరింది. కల్లూరు బైపాస్ వద్దకు రాగానే క్యాబిన్‌లో మంటలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ రఘుపతి లారీని పక్కకు అపి కిందకు దిగి మంటలను ఆదుపు చేసేందుకు ప్రయత్నించాడు. మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. పోలీసు, అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. లారీలో మంటలను ఆదుపు చేశారు. లారీ క్యాబిన్ కాలిపోవడంతో సుమారు రూ. 4 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. లారీ డ్రైవర్ రఘుపతిని పోలీసులు విచారిస్తున్నారు.

ఘనంగా ఓబయ్య జయంతి


ఓబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసిన దృశ్యం

కుందుర్పి, మే 17(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఇండియా ఓబయ్య 109వ జయంతిని శనివారం మండలకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు ఓబయ్య గురించి పలు విషయాలు వివరించారు. ఉపాధ్యాయుడిగా మొదలుపెట్టి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన ఓబయ్య జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. స్వతంత్ర్య ఉద్యమంలో భాగంగా బళ్లారిలో జైలు శిక్ష అనుభవించారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ శాస్త్రి, అపిలేపల్లి సర్పంచ్ హసీనా అతావుల్లా, కుందుర్పి సర్పంచ్ మారుతేశ్వర్ రామ్మూర్తి, మహంతపురం సర్పంచ్ జగన్, జిన్నా ఓబులేష్, కుందుర్పయ్య, శీల మంజునాథ, మహంతపురం వీరన్న, లచ్చన్న పాల్గొన్నారు.

రేపు వాల్మీకి ప్రతిభా పురస్కారాలు

అనంతపురం విద్య, మే 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాల్మీకి, బోయ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు 2024-25 విద్యా ఏడాదికి సంబంధించి ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి చైతన్యకుమార్, కోశాధికారి పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రుద్రంపేట బైపాస్‌లోని వాల్మీకి కల్యాణ మండపంలో ఈ నెల19న ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. వివరాలకు 9440774519, 8309090406 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అప్పుల బాధతో నిరుద్యోగి ఆత్మహత్య


రామునాయక్ (ఫైల్)

తనకల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుగుండు తండాకు చెందిన రామునాయక్ (33) అనే వికలాంగ నిరుద్యోగి శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గోపి తెలిపిన వివరాల మేరకు.. బీఈడీ చదివిన రామునాయక్ కుటుంబ అవసరాలు, చదువుకోసం రూ.2 లక్షలు అప్పులు చేశాడు. డీఎస్సీ కోసం సిద్ధమవుతున్నాడు. ఇంతలో అప్పులవారు ఒత్తిడి చేయడంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి రామలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు తీసిన భూ వివాదం

- రాప్తాడులో దంపతుల హత్య
- పొలంలో వేట కొడవళ్లతో దాడి
- ఇరువర్గాలకు చెందిన పలువురికి గాయాలు





ముత్యాలమ్మ, నారాయణరెడ్డి (ఫైల్), సంఘటనా స్థలంలో కొడవలి, వివరాలు ఆరా తీస్తున్న డీఎస్పీ

రాప్తాడు, మే 17(ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య కొన్నేళ్ల నుంచి కొనసాగుతున్న భూ వివాదం ఇద్దరి హత్యకు దారి తీసింది. భూమి కోసం ఇరువర్గాలు ఘర్షణకు దిగడంతో రాప్తాడుకు చెందిన చిగిచెర్ల ముత్యాలమ్మ(46), చిగిచెర్ల నారాయణరెడ్డి(56) దంపతులు ప్రాణాలు కోల్పోయారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, రాప్తాడు సీఐ శ్రీహర్ష, రాప్తాడు తహసీల్దారు విజయకుమారి తెలిపిన మేరకు, రాప్తాడుకు చెందిన చిగిచెర్ల నారాయణరెడ్డికి గంగలకుంట రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 78-3లో (పాత సర్వే నెంబర్) 6.20 ఎకరాల భూమి ఉండేది. దీన్ని 1997లో రాప్తాడుకు చెందిన కాటమిరెడ్డి ముగ్గురు కూతుళ్లు పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మికి ఎకరం రూ.15 వేలకు విక్రయించారు. కొనుగోలుదారులు రూ.93 వేలు చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్‌కు రమ్మంటే పలు కారణాలు చూపుతూ నారాయణరెడ్డి కాలయాపన చేశారు. దీంతో భూమి కొన్నవారు అప్పట్లో కోర్టును ఆశ్రయించారు. కొన్నేళ్లపాటు కోర్టులో విచారణ జరిగిన తరువాత 2012లో అనంతపురం సివిల్ కోర్టు ఆ భూమి కొన్నవారికే చెందుతుందని తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాలతో కొన్నవారి పేరిట రిజిస్ట్రేషన్ అయింది. అయినా నారాయణరెడ్డే ఆ భూమిని సాగు చేసుకుంటున్నారు. దీంతో భూమిని కొన్నవారు హైకోర్టును ఆశ్రయించారు. 2022లో హైకోర్టు కూడా ఆ భూమి కొన్నవారికే చెందుతుందని తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి 7న రెవెన్యూ అధికారులు కొనుగోలుదారుల పేరిట భూమిని ఆన్‌లైన్ చేయించారు. ఆర్డీఓ ఆదేశాలతో భూమిని కొనుగోలుదారుల పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించామని తహసీల్దార్ తెలిపారు. ఈ క్రమంలో రాప్తాడు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన కొందరు ఆ భూమిని పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి నుంచి ఎకరం రూ.60 లక్షల ప్రకారం కొన్నట్లు అగ్రిమెంటు చేసుకున్నారు. పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, వారి కుటుంబ సభ్యులు, వారి నుంచి భూమిని కొన్నట్లు అగ్రిమెంట్ రాసుకున్న వారు శనివారం ఉదయం పొలానికి వెళ్లారు. ఎక్స్‌కవేటర్‌తో పొలంలోని దానిమ్మ చెట్లను తొలగిస్తుండగా.. నారాయణరెడ్డి, ఆయన భార్య ముత్యాలమ్మ, కుమారుడు ప్రదీప్ కుమార్ రెడ్డి, బావమరిది ప్రతాప్ రెడ్డి పొలానికి వెళ్లారు. అక్కడ ఇరువర్గాలకు ఘర్షణ జరిగింది. వేట కొడవళ్లతో దాడి చేయడంతో ముత్యాలమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నారాయణరెడ్డి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గాయపడిన ప్రతాప్‌రెడ్డి చికిత్స పొందుతున్నాడు. మరో వర్గానికి చెందిన పుల్లమ్మ, నాగలక్ష్మి, బాలనరసింహారెడ్డి, రాప్తాడుకు చెందిన పామళ్ల కొండప్ప గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ డీఎస్పీ వెంకటేశులు, రాప్తాడు సీఐ శ్రీహర్ష సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. హత్యకు వాడిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిపై నారాయణరెడ్డి కుమారుడు ప్రదీప్ కుమార్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ హత్యలను ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొందరు ప్రోత్సహించారని ప్రదీప్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

11 మందిపై కేసు

దంపతుల హత్య కేసులో పదకొండు మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ధనుంజయ, కత్తుల పండయ్య, గోనిపట్ల శీనా, ఇంద్రశేఖర్, కొండప్ప, జగదీష్, గంగలకుంట దుబ్బ లక్ష్మీనారాయణ, దండు నరేంద్ర, నిరంజన్‌రెడ్డి, బాలనరసింహారెడ్డి, దర్మారెడ్డిని నిందితులుగా చేర్చారు. వారికోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఇంట విషాద చాయలు

ముత్యాలమ్మ, నారాయణరెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు. భూ తగాదాలో దంపతులు మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాదం నెకొంది. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న కుటుంబంలో పెద్దలు మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. రాప్తాడులో ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తారని తెలిసింది.

వికటించిన వసూళ్లు..!

- ఆఫీస్‌బాయ్‌పై సీఐ ఒత్తిడి?
- భరించలేక ఎక్సైజ్ సంఘం అధికారుల దృష్టికి విషయం
- విచారణలో ఆఫీస్‌బాయ్‌పై చెప్పుతో దాడి
- కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ తీరుపై ప్రజాసంఘాల ఆగ్రహం
- మామూళ్లు ఇస్తే చాలు మందు ఏదైనా అమ్మొచ్చా..?
- కర్ణాటక మద్యం పట్టుబడితే పండగేనని ప్రచారం



అధికారిని నిలదీస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కళ్యాణదుర్గం, మే 17(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఎక్సైజ్ శాఖలో జరుగుతున్న అవినీతి తతంగం సీఐ తీరుతో బట్టబయలైంది. అక్రమ మద్యాన్ని అరికట్టాల్సిన అధికారే ఆఫీస్‌బాయ్‌ను మధ్యవర్తిగా పెట్టుకుని అవినీతికి పాల్పడుతుండటంపై తీవ్ర విమర్శలు వినవస్తున్నాయి. నియోజకవర్గం పరిధిలో సుమారు వంద గ్రామాల్లో కర్ణాటక మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. తనిఖీల్లో కర్ణాటక మద్యం, టెట్రా ప్యా కెట్లు దొరికితే స్థాయిని బట్టి రూ. 5 వేలు మొదలు రూ. లక్షల దాకా ఆ సీఐ వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అక్రమ మద్యం దొరికితే కేసులు పెట్టకుండా డబ్బులు పుచ్చుకుని పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న వారి నుంచి అధిక మొత్తంలో వసూలు చేయాలని ఆఫీస్ బాయ్‌పై ఆమె ఒత్తిడి చేసినట్లు తెలిసింది. దీన్ని భరించలేని ఆ ఆఫీస్ బాయ్ ఎక్సైజ్ ఉద్యోగుల సంఘానికి ఫిర్యాదు చేశాడు. ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం నాయకులు కళ్యాణదుర్గం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విచారించారు. తనపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ సీఐ ఆ సమయంలో సహనం కోల్పోయి చెప్పు తీసుకుని నానిని కొట్టారు. ఈ సంఘటన మూడు రోజుల క్రితం కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లోనే జరిగింది. అయితే శుక్రవారం రాత్రి వీడియో వైరల్ అయింది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరిండెంట్ రేవతి ఈ వీడియోపై పూర్తి స్థాయిలో శనివారం విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు విచారణ నివేదికలను అందచేస్తామని తెలిపారు. ఆఫీస్ బాయ్‌కి మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారుల అండదండలు ఆ సీఐకు ఉండటంతో ఏమి చేయలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్టేషన్‌లో పని చేసేందుకు సిబ్బంది కూడా భయపడిపోతున్నట్లు సమాచారం. అందరూ సామూహిక సెలవులో వెళ్లాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.


బాయ్‌ని చెప్పుతో కొడుతున్న ఎక్సైజ్ సీఐ హసీనాబాను

ఎక్సైజ్ సీఐపై ప్రజా సంఘాలు ఆగ్రహం

- స్టేషన్ ఎదుట బైఠాయించి...వ్యతిరేకంగా నినాదాలు

కళ్యాణదుర్గం రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్‌లో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్న నానిని ఎక్సైజ్ సీఐ హసీనాబాను చెప్పుతో కొట్టడంపై తీవ్ర దుమారం రేగింది. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట నాని కుటుంబ సభ్యులతో కలిసి నాయీ బ్రహ్మణ కుల సంఘాల నాయకులు, సీపీఐ, సీపీఎం, విద్యార్థి సంఘాల నాయకులు శనివారం ఆందోళనకు దిగారు. స్టేషన్ ఎదుట బైఠాయించి అవినీతి సీఐను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. అవినీతి అధికారిపై విచారణ చేపట్టేందుకు వచ్చిన ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతిలను ప్రజా సంఘాల నాయకులు నిలదీశారు. సీఐ అవినీతితో ఇక్కడ పనిచేసే అధికారులు విసుగెత్తుతున్నారని, ముడుపుల కోసం ఆమె ఒత్తిడులు తట్టుకోలేక గతంలో పనిచేస్తున్న ఓ ఎస్ఐ, మరో ముగ్గురు సిబ్బంది బదిలీపై వెళ్లారని వివరించారు. ప్రతి నెలా మామూళ్ల మత్తులో మునిగితేలుతూ, కర్ణాటక మద్యాన్ని తె ప్పించి వ్యాపారం చేయిస్తోందని ఆరోపించారు. ప్రతి మద్యం షాపు నుంచి ప్రతి నె లా ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఆమెకు అక్రమ మద్యం పట్టుబడి తే పండగే అని తోటి సిబ్బందే బాహటంగా చెబుతుంటారని పేర్కొన్నారు. అవినీతి ఆ రోపణలు ఎదుర్కొంటున్న ఎక్సైజ్ సీఐపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చే శారు. ఆందోళనలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సీపీఎం జిల్లా కమిటీ స భ్యులు అచ్యుత్ ప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు ఆర్కే. రాజు, తిప్పేనాయక్ పాల్గొన్నారు.

నూతన క్రీడాపాలసీ వరం: శ్రీకాంత్

విజయవాడ(స్పోర్ట్స్), మే 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రకటించిన నూతన క్రీడా పాలసీ వర్ధమాన క్రీడాకారులకు వరమని ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక విజయ వాడ క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ కార్యదర్శి శ్రీకాంత్ మట్లాడుతూ అసోసియేషన్ ఎకేఎఫ్ఐ గైడ్ లైన్స్ అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. తమ అసోసియేషన్‌కు ఎకేఎఫ్ఐ గుర్తింపు, సహకారం అందిస్తుందని, రాష్ట్రంలో నిబంధనల ప్రకారం మా అసోసియేషన్‌కి మాత్రమే గుర్తింపు, అర్హత ఉన్నాయని అన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేస్తామని, ఖేలో ఇండియాలో మెడల్ కొట్టిన ప్రతి క్రీడాకారుడికి 5 వేలు బహుమతి అందిచడం జరిగిందని తెలిపారు. గతంలో కొంతమంది కబడ్డీ క్రీడా అసోసియేషన్ పేరుతో వివాదాలు చేశారని, ఇకపై అటువంటి వాటికి ఈ ప్రభుత్వంలో చోటులేదని, త్వరలోనే బీచ్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

- సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాగూర్

ధర్మవరం, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రతే తమ లక్ష్యమని సౌత్‌సెంట్రల్ రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాగూర్ అన్నారు. రైల్వే స్టేషన్‌లో ఉన్న ఆర్పీఎఫ్ కార్యాలయాన్ని శనివారం తనిఖీచేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. కేసులు, వాటి పరిష్కారాలను ఆర్పీఎఫ్ సీఐ నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్పీఎఫ్ మహిళలకు ఏర్పాటు చేసిన విశ్రాంత భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఆర్పీఎఫ్ విభాగంలో మహిళలకు గట్టి భద్రతలను ఇవ్వడమే రైల్వేశాఖ లక్ష్యం అన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుఖవంతంగా ప్రయాణం చేయడానికి ఆర్పీఎఫ్ అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం రైల్వే పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ కమిషనర్ మురళీక్రిష్ణ, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ అనిల్‌కుమార్‌సింగ్, రేణిగుంట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి, ధర్మవరం ఆర్పీఎఫ్ సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐ రోహిత్‌గౌడ్ పాల్గొన్నారు.


లేపాక్షి ఆలయంలో అరోమాసింగ్ ఠాకూర్, ఇతర అధికారులు

లేపాక్షి శిల్పకళ అద్భుతం

లేపాక్షి: లేపాక్షి శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని దక్షిణ మధ్య రైల్వే ఎస్సీఆర్ఐసీ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రెటరీ కమిషనర్ అరోమాసింగ్ ఠాకూర్ అన్నారు. ఆలయాన్ని ఆమె శనివారం సందర్శించారు. ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కల్యాణ మండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభం సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గా వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

మానవతామూర్తి దరూరు పుల్లయ్య: రామకృష్ణ

అనంతపురం విద్య, మే 17(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మానవతామూర్తి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కొనియాడారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం రాత్రి నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. పుల్లయ్య చిత్రపటానికి రామకృష్ణ, మానవహక్కుల వేదిక చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీశ్, రచయిత బండి నారాయణ స్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు దాదాగాంధీ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... 1977లో అనంతపురం ఎంపీగా గెలిచిన తర్వాత దరూరు పుల్లయ్య ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేశారని అన్నారు. అప్పటి సీఎం వైఎస్సార్ దృష్టికి తీసుకువెళ్లి హంద్రీనీవా లిఫ్టులను తగ్గించేందుకు విశేషంగా కృషి చేశారని అన్నారు. ఆయన పేరిట ట్రస్టు ఏర్పాటుచేసి, పేదలకు సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, నారాయణ స్వామి, రామకృష్ణ, నాగరాజు, రామాంజి, బాషా, అల్లిపీరా, కాటమయ్య పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

3,815 మందికి బదిలీ తప్పదు..!

- ఒకేచోట 5-8 ఏళ్లు పనిచేసిన టీచర్లు
- మొత్తం ఖాళీలు 7,643
- క్లియర్ వేకెన్సీలు 923
- రీ అపోర్షన్ ఖాళీలు 2,875
- ఈ ఖాళీలే దాదాపు ఫైనల్

అనంతపురం విద్య, మే 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,815 మంది ఉపాధ్యాయులు తప్పనిసరి బదిలీ అవ్వాల్సిన జాబితాలో ఉన్నారు. ఒకే స్థానంలో 5 నుంచి 8 ఏళ్లపాటు విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులు రెండు జిల్లాల్లో 3,815 మంది ఉన్నారని విద్యాశాఖ అధికారులు తేల్చారు. వీరంతా తప్పనిసరిగా బదిలీ అవుతారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫైనల్‌గా 7,643 పోస్టులు ఖాళీలు ఉన్నట్లుగా ఉమ్మడి విద్యాశాఖ జిల్లా అధికారులు తేల్చారు. ఈ ఖాళీలు దాదాపుగా ఫైనల్ అయినట్లు తెలుస్తోంది. వీటిలో రీ అపోర్షన్ వేకెన్సీలుగా 2,875, క్లియర్ వేకెన్సీలు 923 ఉన్నట్లు గుర్తించారు. మరో 30 వరకూ ఎఫ్ఎస్‌టీసీ, స్టడీ లీవ్, అనధికార గైర్హాజరు తదితర ఖాళీలు ఉన్నాయి. బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్లకు ఏకంగా 1,648 ఖాళీలు గుర్తించారు. ఇందులో 5 ఏళ్లు, 8 ఏళ్లు పూర్తయిన వారి కోసం 821 ఖాళీలు, క్లియర్ వేకెన్సీలు 209 కాగా, రీ -అపోర్షన్ వేకెన్సీల కింద 610 ఖాళీలు చూపించారు. మరో 8 ఖాళీలు ఇతర కేటగిరీల కింద చూపించారు. గత 10 రోజులుగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు, ఐటీ సెల్ సిబ్బంది, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ఎమ్మార్సీ సిబ్బంది కరసత్తు చేసి ఈ ఖాళీలు గుర్తించారు.

హోదా	సబ్జెక్టు	మీడియం	ఖాళీలు
ప్రైమరీ హెచ్‌ఎం	–	–	712
గ్రేడ్-2 హెచ్‌ఎం	–	–	178
ఎస్‌జీటీ		తెలుగు	2884
ఎస్‌జీటీ		ఉర్దూ	114
ఎస్‌జీటీ		కన్నడ	16
ఎస్‌జీటీ-		ఇంగ్లీష్	348
ఎస్ఏ	గణితం	తెలుగు	391
ఎస్ఏ	గణితం	ఉర్దూ	23
ఎస్ఏ	గణితం	కన్నడ	02
ఎస్ఏ	గణితం	ఇంగ్లీష్	102
ఎస్ఏ	ఫిజికల్ సైన్స్	తెలుగు	367
ఎస్ఏ	ఫిజికల్ సైన్స్	ఉర్దూ	18
ఎస్ఏ	ఫిజికల్ సైన్స్	కన్నడ	04
ఎస్ఏ	ఫిజికల్ సైన్స్	ఇంగ్లీష్	90
ఎస్ఏ	బయాలజీ	తెలుగు	408
ఎస్ఏ	బయాలజీ	ఉర్దూ	20
ఎస్ఏ	బయాలజీ	కన్నడ	05
ఎస్ఏ	బయాలజీ	ఇంగ్లీష్	92
ఎస్ఏ	సోషల్	తెలుగు	291
ఎస్ఏ	సోషల్	ఉర్దూ	16
ఎస్ఏ	సోషల్	కన్నడ	02
ఎస్ఏ	సోషల్	ఇంగ్లీష్	83
ఎస్ఏ	ఫిజికల్ ఎడ్యుకేషన్	తెలుగు	254
ఎస్ఏ	ఫిజికల్ ఎడ్యుకేషన్	ఉర్దూ	4
ఎస్ఏ	ఫిజికల్ ఎడ్యుకేషన్	ఇంగ్లీష్	59
ఎస్ఏ	స్పెషల్ ఎడ్యుకేషన్	తెలుగు	21
ఎస్ఏ	స్పెషల్ ఎడ్యుకేషన్	ఇంగ్లీష్	02
ఎస్ఏ		తెలుగు	277
ఎస్ఏ		ఉర్దూ	20
ఎస్ఏ		హిందీ	247
ఎస్ఏ		కన్నడ	01
ఎస్ఏ		సంస్కృతి	06
ఎస్ఏ		ఇంగ్లీష్	586

చీనీ కాయలు టన్ను రూ.37వేలు

అనంతపురంరూరల్, మే17 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37వేలు, కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.25వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 760టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

న్యూస్ బాక్స్

ఐదు రోజులుగా నీటి వృథా


వృథా అవుతున్న తాగునీరు

ధర్మవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రకటనలు గుప్పిస్తున్న మున్సిపల్ అధికారులు.. ఐదు రోజులుగా భారీగా తాగునీరు వృథా అవుతున్నా పట్టించుకోలేదు. స్థానిక తిక్కస్వామి నగర్‌లో సంఘమేశ్వరం వెళ్లే ప్రధాన రహదారి వద్ద గేటు వాల్వ్ వద్ద మున్సిపాలిటీ నీరు ఐదు రోజులుగా వృథా అవుతోంది. ఆ నీరంతా వంక పాలు అవుతోంది. మున్సిపాల్టీ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది అటు వెళ్తున్నా.. దీని గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే

ధర్మవరం, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించడానికి సర్వే చేపట్టిందని ఎంఈఓ-1 రాజేశ్వరి, ఎంఈఓ-2 గోపాల్‌నాయక్‌లు తెలిపారు. ఈ మేరకు భవిత కేంద్ర ఉపాధ్యాయులు సరస్వతి, మల్లికార్జున ఇందిరమ్మ కాలనీలోసర్వే నిర్వహించారు. కాలనీలో ఓ విద్యార్థిని గుర్తించి తల్లిదండ్రులకు పాఠశాలలో చేర్పించాలని తెలియజేశారు.

ఎయిడ్స్‌పై కళాజాతా

బత్తలపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో శనివారం ఎయిడ్స్ నియంత్రణ, కట్టడిపై శనివారం కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విష్ణువర్ధన్, కళాకారులు పాల్గొన్నారు.

నేడు ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ర్యాలీ

నల్లచెరువు (కదిరి), మే 17(ఆంధ్రజ్యోతి): భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ఆదివారం కదిరి పట్టణంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబు, గుప్తప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరి పట్టణంలోని పీవీఆర్ గ్రాండ్ నుంచి నిర్వహించే ఈ ర్యాలీలో మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్‌గా క్రాంతికుమార్



పుట్టపర్తి, మే 17(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా క్రాంతికుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రహల్దాద కదిరికి బదిలీ అయ్యారు. గుడివాడలో పనిచేస్తున్న క్రాంతికుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీకి 548 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మే 17(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా వ్యాప్తంగా జరిగిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 548 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు డీఐఈఓ సయ్యద్‌మౌలా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షకు 4,594 మందికి గాను 4,118 మంది హాజరయ్యారని, 476 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షకు 1170 మందికి గాను 1092 మంది పరీక్షలు రాశారని, 78 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

కుట్టు శిక్షణను ప్రారంభించిన మంత్రి

ముదిగుబ్బ, మే 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర పాఠశాలలో మహిళా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ శిక్షణను మహిళలు వినియోగించుకోవాలని కోరారు. 90 రోజులు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో 75 శాతం ముఖ హాజరు తప్పనిసరిగా ఉండాలని, 90 రోజుల శిక్షణ తరువాత ఉచితంగా కుట్టు మిషన్, శిక్షణా పత్రం అందిస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు శిక్షణా కేంద్రాలు ఉన్నాయని, ప్రతి శిక్షణా శిబిరంలో ఉదయం, సాయంత్రం రెండు బ్యాచ్‌లకు శిక్షణ అందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అందిస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు ముందే మండలంలోని నాగారెడ్డిపల్లిలో నిర్వహించిన ఎద్దు పరుగు పందెం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోర్లు ప్రారంభం

బత్తలపల్లి: బత్తలపల్లిలో శనివారం తాగునీటి బోర్లను మంత్రి ప్రారంభించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఉందన్న విషయన్ని అధికారులు మంత్రి సత్యకుమార్ దృష్టి ఇటీవల తీసుకెళ్లారు. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని ప్రత్యేక నిధులు విడుదల చేయించారు. మొత్తం 15 బోర్లను వేయించారు. మండల కేంద్రంలో ఓ బోరును మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

పుట్టపర్తిరూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం సాదాసీదాగా సాగింది. సంబంధిత శాఖల అధికారులు వారి వారి శాఖల నివేదికలను సమావేశంలో వెల్లడించారు. పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు సమావేశానికి డుమ్మాకొట్టారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఎంపీపీ, గ్రామసర్పంచులు, ఎంపీడీఓలు మొక్కల నాటారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ జోత్స్న,సీహెచ్ఓ నగేష్ సర్పంచులు శ్రీనివాసులు గంగమ్మ పాల్గొన్నారు.

విద్యార్థినికి రెండు బంగారు పతకాలు


జాహ్నవికి పతకాలు అందజేస్తున్న గవర్నర్

తనకల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని జేఎన్టీయూలో శనివారం నిర్వహించిన 14వ స్నాతకోత్సవ వేడుకల్లో మండల కేంద్రానికి చెందిన జాహ్నవి రెండు పతకాలను సాధించింది. ఆమె తండ్రి హరేంద్రప్రసాద్ మండలంలోని ఈతోడు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు. జాహ్నవి అనంతపురం జేఎన్‌టీయూలో క్రెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి టాపర్‌గా నిలిచింది. దీంతో జేఎన్‌టీయూ, క్రిష్ణమాచార్య ఎండోమెంట్ వారి నుంచి రెండు బంగారు పతకాలు సాధించింది. జేఎన్టీయూ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ జాహ్నవికి ఆ బంగారు పతకాలు అందించారు.

కిషోరి వికాసంపై అవగాహన

తనకల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడేశ్వరీ మండల కార్యాలయంలో సీడీపీఓ జయంతి ఆధ్వర్యంలో కిషోరి వికాసంపై శనివారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోరి బాలికలు, పీఓ లీడర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కిషోరి బాలికలకు పలురకాల సూచనలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మీదేవమ్మ, జయమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

సార్.. పంటలు ఎండుతున్నాయ్..!

- నాలుగు రోజులుగా కరెంట్ సరఫరా బంద్
- ఈదురు గాలులకు అంతరాయం
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు


చిగిచెర్ల వద్ద ఎండు దశకు చేరిన టమోటా నార

ధర్మవరం రూరల్, మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల గ్రామంలో నాలుగు రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. నాటి నుంచి అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించ లేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయి.. పట్టించుకోండి సార్ అంటూ పలువురు రైతులు వేడుకున్నా.. ఆ అధికారులు కరుణించలేదు.
మండలంలోని చిగిచెర్ల గ్రామానికి సంబంధించి రైతుల పొలాల్లో సుమారు 100 బోర్లకు పైగా విద్యుత్ సరఫరా గొట్లూరు సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అవుతోంది. అయితే నాలుగు రోజుల క్రితం ఈదురు గాలులకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. కనీసం మండల ఏఈకు, లైన్‌మెన్లకు ఫోన్‌లు చేసినా వారు ఫోన్ కూడా ఎత్తడం లేదని, అసలు ఏమిజరిగింది .. ఎప్పుడు కరెంట్ వస్తుంది.. అనే సమాచారం కూడా ఇచ్చేవారే లేరని పలువురు రైతులు మండిపడుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి పంటలను కాపాడాలని కోరుతున్నారు.
చిగిచెర్ల గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి, హనుమంతరెడ్డి రెండు ఎకరాల్లో టమోటా పంట సాగు చేస్తున్నారు. టమోటా నారు నాటిన తర్వాత ప్రతి మూడు రోజుల కొకసారి నీరు పెట్టాల్సి ఉంది. అయితే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి నాలుగు రోజులుగా కరెంట్ రాకపోవడంతో నాటిన టమోటా నార ఎండు దశకు చేరింది. వేలకు వేలు వెచ్చించి పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేసుకుంటున్నామని, కరెంట్ కోతలతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆ రైతులు వాపోతున్నారు. కరెంట్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఆంధ్రజ్యోతి ఏఈ జానకీరామయ్యను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. దీంతో ఏడీ నరసింహారెడ్డిని సంప్రదించగా .. విద్యుత్ సరఫరా ఆగిపోయినట్లు తన దృష్టికి రాలేదన్నారు.

ఘనంగా గంగాభవాని ఊరేగింపు


అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, అమ్మవారి వేషధారణలో యువతులు, అలంకరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహం (ఇన్‌సెట్లో)

గాండ్లపెంట, మే 17(ఆంధ్రజ్యోతి): స్థానిక గంగాభవాని అమ్మ ఆలయ 17వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. అమ్మవారిని ప్రతేకంగా అలంకరించిన రథంపై అమ్మవారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆ ఊరేగింపులో యువతులు అమ్మవారి వేషం ధరించి నృత్యాలు చేశారు. చెక్కభజనలు, కోలాటాలు, మహిళలు నూనె దీపాలతో ముందుకు సాగారు. రాత్రి ఆర్కెస్ట్రా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లికార్జున, ఆనంద్, నటరాజశెట్టి, ఓబులరెడ్డి, శివ, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నమ్మ పరుష ప్రారంభం


చిన్నమ్మ తల్లి గ్రామోత్సవానికి హాజరైన భక్తులు

నల్లమాడ/ఓబుళదేవరచెరువు, మే 17(ఆంధ్రజ్యోతి): నల్లమాడ మండలంలోని వంకరకుంట గ్రామ సమీపంలో చిన్నమ్మ పరుష శనివారం ప్రారంభమైంది. చిన్నమ్మ పుట్టినిల్లు అయిన ఓడీసీ మండలంలోని బత్తినపల్లి నుంచి చిన్నమ్మ ఆభరణాలు, వస్త్రాలను పెట్టెలో పెట్టుకుని ఊరేగింపుగా బయలుదేరారు. చౌటకుంటపల్లి, చిల్లగోర్లపల్లి, నల్లమాడ, చెరువువాండ్లపల్లి మీదుగా బసిరెడ్డిపల్లికి తీసుకెళ్లారు. ఆయాగ్రామాల మహిళలు తడిబట్టలతో ఆ మార్గంలో పండుకోగా.. పెట్టెను ఎత్తుకున్నవారు వారిని తొక్కుకుంటూ వెళ్లారు. ప్రతి గ్రామంలోనూ పెద్ద ఎత్తున చినమ్మ పెట్టెకు కాయల, కర్పూరం సమర్పించారు. బసిరెడ్డిపల్లి నుంచి ఆదివారం చిన్నమ్మ పరుషలోకి ఆ ఆభరణాలు తీసుకెళ్లి అమ్మవారిని అలంకరిస్తారు.

ఖాద్రీ ఆలయం కిటకిట


స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

కదిరి, మే 17(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు, శనివారం కావడంతో స్థానిక ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉన్నారు. తెలుగు రాష్ట్రాల భక్తులే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచీ భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శంచుకోవడానికి శుక్రవారం రాత్రే కదిరి చేరుకున్నారు. స్వామివారి ధ్వంజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. ఆలయాధికారులు అన్నదాన సౌకర్యం కల్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

తనకల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. మండల కేంద్రానికి సమీపంలో మండ్లిపల్లిమిట్ట వద్ద ఉన్న ఎస్ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన టీడీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడ నీటి సమస్య ఏర్పడిన 24 గంటలలోపు పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. మండల టీడీపీ నాయకులు నెలకొసారి కార్యకర్తల సమావేశం నిర్వహించి సమస్యలను గుర్తించాలని, ప్రాధాన్యతను బట్టి వాటిని పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులను అధికారులు నెలరోజుల్లో పరిష్కరించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయాల్లో కూడా ఏఐ సేవలు అందుబాటులోకి వచ్చాయని, ప్రతి ఒకరూ ఆ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని అన్నారు. బూత్ కమిటీలను బలోపేతం చేస్తామన్నారు. టీడీపీ కార్యకర్తలపై ఎవరైనా దౌర్జన్యాలకు పాల్పడితే సహించేదిలేదని, గత వైసీపీ పాలనలో పాపాలు చేసిన 40 మంది నేడు ఊచలు లెక్కిస్తున్నారని, చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తున్నారని అన్నారు. మండలంలో భూములు, మద్యం, ఎర్రచందనం అక్రమార్కులు.. నోరు అదుపు పెట్టుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫర్వీన్‌భాను, రెడ్డిశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌నాయుడు, రవీంద్రారెడ్డి, దేశాయి ప్రభాకర్‌రెడ్డి, విదురశేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, తోట సరోజమ్మ, సర్పంచ్‌లు కాంతమ్మ, జయమ్మ, రామాంజులమ్మ, ఎంపీటీసీ మాధవరెడ్డి, హరినాయక్, కోటిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, చిన్నప్ప, శంకర్‌నాయక్, దస్తగిరి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ఉత్సాహంగా 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో శనివారం అధికారులు, పాలకులు, కూటమి నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. కొత్తచెరువు నెహ్రూ కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ చేతన్ పాల్గొన్నారు. అధికారులు, ప్రజలతోనూ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణాన్ని ఎస్పీ వీ.రత్న తన సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పరక పట్టి చెత్తను ఊడ్చారు. ధర్మవరంలో ఆర్డీఓ మహేశ్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ధర్మవరం మండలంలో రేగాటిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకంమధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ సాయిమనోహర్ పాల్గొన్నారు. నంబులపూలకుంట సచివాలయాలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ పార్థసారధి, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి పాల్గొన్నారు. నల్లచెరువులోని కె. పూలకుంటలో వైద్యాధికారులు అధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. నల్లమాడ రెడ్డిపల్లిలో వైద్య సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.


కొత్తచెరువు : ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ చేతన్, పుట్టపర్తి : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్న, బత్తలపల్లి : చెత్త ఊడ్చుతున్న మంత్రి సత్యకుమార్

బీరువాను ఎత్తుకెళ్లిన దుండగులు

రూ. 1.30 లక్షలు, ఒకటిన్నర తులం బంగారు నగలు చోరీ

నల్లచెరువు (కదిరి), మే 17(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలంలోని ఎర్రగుంటపల్లిలో శుక్రవారం రాత్రి దుండగులు ఇంట్లోని బీరువాను సమపంలోని పొలాల్లోకి ఎత్తుకెళ్లి.. అక్కడ పగలగొట్టి.. అందులోని రూ. 1.30 లక్షల నగదు, ఒకటిన్నర తులం బంగారు నగలను ఎత్తుకెళ్లారు. వెంకటమల్లయ్య దంపతులు శుక్రవారం రాత్రి పక్కనే కొత్తగా నిర్మిస్తున్న ఇంటిపై నిద్రించారు. దుండగులు అతని ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాను సమీపంలోని పొలాల్లోకి ఎత్తుకెళ్లారు. అక్కడ బీరువాను పగలకొట్టి అందులోని నగదు, బంగారు నగలను ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ నాగేంద్ర, ఎస్ఐ మగ్బుల్‌బాషా శనివారం పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి సమస్యలు పరిష్కరించాలి


ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కూలీలు

నంబులపూలకుంట, మే 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మండలంలోని సోమరాజుకుంట గ్రామానికి చెందిన కూలీలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. బిల్లులు అడిగితే ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది పనికి వద్దంటున్నారని, వ్యవసాయ పనులకు వెళ్లినా, డబ్బులు వచ్చేవని, ఉపాధిలో చేసిన పనులకు రసీదులు, బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పనులు చేయని కూలీలు పట్టణాల్లో ఉన్నా బిల్లులు ఇస్తున్నారని ఆరోపించారు. పనులను అడిగితే తమపైకి వారికుటుంబ సభ్యులు ఘర్షణకు దిగుతున్నారని వెంకటలక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా రోజులుగా జాబ్‌కార్డులేక ఇబ్బదులు పడుతున్నాని, ఆధార్‌కార్డులు ఇచ్చినా, జాబ్‌కార్డు మంజూరు చేయడం లేదని, పెద్దమొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని కూలీ రమణ వాపోయాడు. వీటిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పార్థసారధి, ఈసీ శ్రీధర్‌రెడ్డి ఆ కూలీలకు హామీ ఇచ్చారు.

సెకీతో ఒప్పందం రద్దు చేయాలి : సీపీఐ


సీపీఐ రామకృష్ణ

కదిరి అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ సెకీ ద్వారా జరిగిన విద్యుత్ ఒప్పందాల వల్ల వినియోగదారులపై మోయలేని భారం పడిందన్నారు. ఈ ఒప్పందాన్ని 2021లోనే తమ పార్టీ వ్యతిరేకించిందన్నారు. దాదాపు రూ.1,750కోట్లు మన రాష్ట్రంలో అప్పట్లో అధికారంలో ఉన్నవారికి లంచాల రూపంలో ముట్టాయని ఆరోపించారు. ఏడు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఒప్పందం చేసుకుందన్నారు. ఇన్నిరోజులకు అవకతవకలు గుర్తించిన కేంద్రం ఒక నెలలో రిటైర్డ్ కాబోతున్న సెకీ సీఎండీ రామేశ్వర్‌ప్రసాద్‌గుప్తను తొలగించిందన్నారు. 2021లో అగ్రిమెంటు జరిగినప్పుడు రూ.2.49తో ఒక యూనిట్ కొనుగోలు చేశారన్నారు. అయితే అదే సంవత్సరం గుజరాత్ ప్రభుత్వంతో రూ.1.99 లకే ఒప్పందం చేసుకోవడం గమనార్హమన్నారు. దుర్మార్గమైన ఈ ఒప్పందం రద్దు చేసేవరకు పోరాడతామన్నారు. ఢిల్లీలో కూడా దీనిపై ఆందోళనలు చేపడతామన్నారు. తన మధ్యవర్తిత్వం వల్లే ఇండియా, పాకిస్తాన్ సీజ్ ఫైర్ ప్రకటించాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పడాన్ని ఖండించకపోవడంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ఆంతర్యమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, కదిరప్ప, తదితరులున్నారు.

కిచెన్ గార్డెన్ పెంపకంపై అవగాహన


కిచెన్ గార్డెన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారి

పుట్టపర్తిరూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఎనుమలపల్లి గ్రామంలో కిచెన్ గార్డెన్‌లో కూరగాయల పెంపకంపై జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్ శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిచెన్ గార్డెన్‌లో పెంచే కూరగాయలతో ఆరోగ్యకరమైన ఆహారం పొందడానికి అవకాశం దొరకుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి నవీన్, సహాయకులు వేమారెడ్డి, సిబ్బంది రామాంజినేయులు, రామకృష్ణ పాల్గొన్నారు.

జనసేన వలంటీర్లకు సన్మానం


వలంటీర్లకు కిట్లను పంపిణీ చేస్తున్న చిలకం

ధర్మవరం, మే 17(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శనివారం సన్మానించారు. వారికి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి సభ్యత్వ కిట్లను అందజేశారు. సభ్యత్వంతో కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు, భరోసా ఉంటాయన్నారు. ఈ సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయితే వారి కుటుంబాలకు పరిహారంగా రూ.5 లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర పార్టీ కార్యాలయ అబ్జర్వర్ జ్ఞానేశ్వర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అడ్డగిరి శ్యాంకుమార్, నాయకుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్టపర్తిలో భారీ వర్షం

పుట్టపర్తిరూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రమైన పుట్టపర్తిలో శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వేసవితాపంతో అల్లాడుతున్న పట్టణవాసులు ఈ భారీ వర్షంతో ఊరట చెందారు. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ మోకాలు లోతు వర్షపు నీటితో జలమయమయ్యాయి.


పుట్టపర్తిలో రహదారిపై పారుతున్న వర్షపునీరు

రోడ్లకు మహర్దశ: మంత్రి సవిత

పలు గ్రామాల్లో సీసీ రోడ్ల పరిశీలన



మునిమడుగులో నిర్మాణమైన రోడ్డును చూపుతున్న మంత్రి

పెనుకొండ రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో రోడ్లకు మహర్దశ కలిగిందని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. వైసీపీ హయాంలో అధ్వానంగా ఉన్న రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. శనివారం గుట్టూరు, మునిముడుగు గ్రామాల్లో రూ.8కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రోడ్లకు పూర్వవైభవం తెచ్చారన్నారు. వేల కోట్ల నిధులతో గుంతలు పూడ్చడం, మరమ్మతులు, నూతన రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. నాడు గుంతలమయమైన రోడ్లు నేడు సుందరీకరణ చేయడంపట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీరుకు అభినందన

పెనుకొండ, మే 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ జూనియర్‌కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ సుబ్రహ్మణ్యం కర్ణాటక రాష్ట్రంలోని బెళగావిలోని రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయంలో ఈనెల 19నుంచి 20వరకు జరిగే జాతీయ సమైఖ్యత శిబిరానికి ఎంపికైనట్లు ఎన్‌ఎస్‌ఎస్ అధికారి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప తెలిపారు. ఎంపికైన విద్యార్థిని మంత్రి సవిత అభినందించి నగదు, బహుమతి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గోరంట్ల, మే17 (ఆంధ్రజ్యోతి): మంత్రి సవిత బాధిత కుటుంబాలను శనివారం పరామర్శించారు. గంగంపల్లికి చెందిన టైలర్ రుద్ర కుమారు, తాటిమేకలపల్లి గ్రామానికి చెందిన కార్యకర్త లక్ష్మీనారాయణ మృతిచెందారు. వారి కుటుంబాలను మంత్రి సవిత పరామర్శించారు. సుందురువాండ్లపల్లికి చెందిన సీనియర్ నాయకుడు క్రిష్టప్ప అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించారు.

మినీ మహానాడును విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, మే17(ఆంధ్రజ్యోతి): మినీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు కోరారు. శనివారం క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 19వ తేదీన పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10గంటలకు మినీమహానాడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రతిఏడాది ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడుకు సంబంధించిన పలు తీర్మానాలపై మినీమహానాడులో చర్చించడం జరుగుతుందన్నారు. పార్టీపరంగా, అభివృద్ధిపరంగా, భవిష్యత్తులో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి అన్న అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. మినీ మహానాడు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై వారి అభిప్రాయాలు తెలపాలని కోరారు. మినీమహానాడు కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపండి

పట్టణవాసులకు మున్సిపల్ చైర్మన్ రమేష్



హిందూపురంలో మానవహారంగా ఏర్పడిన నాయకులు

హిందూపురం, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ సూచించారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఎండకాలంలో ఎక్కువ నీటిని తాగాలని బయటికి వస్తే గొడుగులు ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపాలన్నారు. దీనివల్ల భూమికాలుష్యం అవుతుందని సమాజానికి చేటుగా మారుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్ నాగేంద్ర, నాయకులు నవీన్, నాగేంద్ర, వెంకటస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

సోమందేపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా పంచాయతీ కార్యాలయంలోని సచివాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది మండల అధికారులు కార్యక్రమంలో పాల్గొని పరిసరాలు శుభ్రం చేశారు. అదే విధంగా పందిపర్తి గ్రామంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రపరిచి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ రహిత నిర్మాణం కోసం అందరూ కృషిచేయాలన్నారు. మెడికల్ ఆఫీసర్ ఆయిషా మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఈఓ ఆర్డీ లక్ష్మీనరసమ్మ, కార్యదర్శి రామాంజినేయులు పాల్గొన్నారు.



అగళిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ యాదవేంద్ర

సిబ్బందిచేత ప్రతిజ్ఞ

అగళి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్బారావు, సచివాలయంలో ఎంపీడీఓ యాదవేంద్ర సిబ్బందిచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి, అసిస్టెంట్ ఇంజనీర్ అభిజిత్, ఎంఆర్సీ వెంకటేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రంగనాథ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం

గోరంట్ల, మే17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతతోనే ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గుమ్మయ్యగారిపల్లి, మసీదు సర్కిల్, ప్రభుత్వ ఆసుపత్రి కూడలిల్లో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మార్సీ వద్ద ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేసి, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ శృతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మోహన్, హౌసింగ్ ఏఈ గణేష్, సాయిసంజయ్, అధికారులు, టీడీపీ నాయకులు కక్కల రఘునాథ్‌రెడ్డి, నాగరాజు, ఉమాశంకర్ తదితరులున్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించండి

జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమరావు



కోర్టుభవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమరావు

హిందూపురం, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు భవనాలను జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోర్టు భవనాలు, కోర్టు ఆవరణం, పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. క్లరికల్ విభాగంలో రికార్డుల గది, స్టెనో విభాగం, కాపీ సెక్షన్, లోక్ అదాలత్ తదితర విభాగాలను పరిశీలించారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి, అదనపు జూనియర్ సివిల్‌న్యాయాధికారి భవనాలను పరిశీలించి పాత భవనం కూల్చడం, వాటికి సంబంధించిన నిధులపై అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్, అదనపు జూనియర్ సివిల్‌న్యాయాధికారి లలిత లక్ష్మీ హారిక, ప్రత్యేక మెజిస్ట్రేట్ రామణయ్య పాల్గొన్నారు.

'నిబద్ధతతో పనిచేయండి'

హిందూపురం, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు నియమించిన పారాలీగల్ వలంటీర్లు నిబద్ధతతో పనిచేయాలని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ సూచించారు. శనివారం కోర్టు ఆవరణంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్‌తో కలిసి పారాలీగల్ వలంటీర్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ కేటాయించిన విధులను నిర్వహిస్తూ ప్రజల సామాజిక, వ్యక్తిగత సమస్యలను పరిష్కరించడంపై దృష్టిసారించాలన్నారు. మీ పరిధిలో సమస్య పరిష్కారం కాకపోతే లిఖితపూర్వకంగా మండల న్యాయసేవాధికారి సంస్థ దృష్టికి బాధితుల ద్వారా తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలన్నారు.

బాడీ బిల్డర్లకు అభినందనలు

హిందూపురం, మే 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన యువకులను అధికారులు, నాయకులు అభినందించారు. ఈనెల 12న కదిరిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో మిస్టర్ ఆంధ్ర క్లాసిక్ బాడిబిల్డింగ్ ఫిజిక్ స్పోర్ట్స్, మాస్టర్ చాంపియన్ షిప్ 2025 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు హిందూపురం కింగ్‌స్టార్ జిమ్ తరుపున నలుగురు యువకులు పాల్గొని ప్రతిభ చాటారు. మెన్‌ఫిజిక్స్ పోటీల్లో రెండో స్థానంలో షబ్బీర్, అభిషేక్, బాడిబిల్డింగ్ పోటీల్లో మూడోస్థానంలో రిజ్వాన్, నాలుగో స్థానంలో ఇమ్రాన్ నిలిచారు. విజేతలను శనివారం మున్సిపల్ చైర్మన్ రమేష్, డీఎస్పీ మహేష్ అభినందించారు. కార్యక్రమంలో సీఐ రాజగోపాల్‌నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ అనీల్‌కుమార్, కౌన్సిలర్ ఇర్షాద్, సాని ముతువల్లి తల్హా, జిమ్ నిర్వాహకులు షఫీ, సమీ, జబీవుల్లా, సల్మాన్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి



సోమశేఖర్ (ఫైల్)

చిలమత్తూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ఈత కొట్టేందుకు వెళ్లిన వ్యక్తికి అనుకోకుండా ఫిట్స్ రావడంతో మృతిచెందాడు. మండలంలోని మరవకొత్తపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సోమశేఖర్ (29) అనే యువకుడు శనివారం మధ్యాహ్నం ఈత కొట్టడానికి చేనేపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు బంధువులతో వెళ్లాడు. బావిలో ఈత కొట్టి బయటకు వచ్చిన అతను కాలికి మట్టి అయ్యిందని శుభ్రం చేసుకునేందుకు మరోసారి బావిలోకి దిగాడు. సరిగ్గా అదే సమయంలో ఫిట్స్ రావడంతో బావిలో పడిపోయి నీటిలో మునిగిపోయాడు. అతని వెంట వచ్చిన వారు సోమశేఖర్ నీటిలో మునిగిపోయిన విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు బావి వద్దకు వెళ్లేసరికి సోమశేఖర్ మృతి చెందాడు. పోలీసులకు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

రొళ్ల, మే 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎం.రాయాపురం, గొల్లహట్టిలో కొన్ని నెలలుగా తాగు నీటి సమస్య ఉండేది. మండల టీడీపీ కన్వీనర్ దాసిరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, కార్యదర్శి ఈరన్న తదితరులు మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వారి ఆదేశాలతో శనివారం గ్రామంలో బోరుబావి తవ్వించారు. పుష్కలంగా నీరు లభించాయి. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పంచాయతీ నాయకులు, బిలియన్న, రామచంద్రప్ప, ముడుపే గౌడ్, పాండురంగప్ప పాల్గొన్నారు.

నేడు మినీ మహానాడు

హిందూపురం, మే 17(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ హిందూపురం నియోజకవర్గం మినీమహానాడు సమావేశం ఆదివారం జరుగనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్ పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు జేవీఎస్ ప్యాలెస్‌లో జరిగే నియోజకవర్గస్థాయి మినీ మహానాడును పార్టీ విజయవంతంచేయాలన్నారు.

నేడు పురంలో తిరంగా ర్యాలీ

ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన నేపథ్యంలో ఆదివారం హిందూపురంలో తిరంగ ర్యాలీ నిర్వహించనున్నట్లు కూటమి నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9గంటలకు సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి జాతీయ జెండాలతో ర్యాలీగా అంబేడ్కర్ సర్కిల్ వరకు కొనసాగుతుందన్నారు.

నీటితొట్టెలను సద్వినియోగం చేసుకోండి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి



నీటితొట్టెను ప్రారంభిస్తున్న సూర్యనారాయణరెడ్డి

మడకశిర రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పశువుల నీటితొట్టెలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కల్లుమర్రి పంచాయతీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన పశువుల నీటి తొట్టెలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదు మండలాలకు 280 నీటి తొట్టెలు మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క నీటి తొట్టెను రూ.33220తో నిర్మించడం జరుగుతోందన్నారు. పనులు వేగంగా జరుగుతున్నాయని, రైతులు నీటి తొట్టెను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ, క్లష్టర్ ఇన్‌చార్జి నాగరాజు. ఏఓ శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శి వరదరాజులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

సోమందేపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాగేచెరువు గ్రామంలో శనివారం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మంజూరైన రూ. 30 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 30 ఏళ్లుగా పంచాయతీలో తాగునీటి సమస్య ఉందన్నారు. మంత్రి సవిత చొరవతో సమస్య పరిష్కారమైందన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, పూల వెంకటేశులు, కురుబ తిమ్మయ్య, కార్యదర్శి అంజి, జనసేన నాయకులు నాగరాజు, మాజీ సర్పంచ్ కొత్తపల్లి శేషు, కాంట్రాక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా క్యాంటిన్ ప్రారంభం



ఇందిరా క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, మే 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నూతనంగా నిర్మించిన ఇందిరా క్యాంటిన్‌ను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్ర హోంమంత్రి పరమేశ్వర్, పావగడ, తుమకూరు ఎమ్మెల్యేలు వెంకటేశ్, గణేష్ హాజరయ్యారు. కాగా పావగడ ఎమ్మెల్యేకు ప్రత్యేక హోదా కల్పించి అతిథులు వెంకటేశ్ చేతుల మీదుగా క్యాంటిన్‌ను ప్రారంభింపజేశారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన తన రాజకీయ గురువు పరమేశ్వర్‌కు ఎమ్మెల్యే వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ శుభకల్యాణ్, కమిషనర్ అశ్విజ, ఎస్పీ అశోక్‌కుమార్, జిల్లా పంచాయతీ సీఎస్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల



కార్యకర్తను పరామర్శిస్తున్న గుండమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. మండలంలోని సింగేపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరెడ్డి, నరసింహారెడ్డిలను శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం గుండమల తిప్పేస్వామి మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే బలమని, వారికి ఎప్పుడూ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, క్లష్టర్ ఇన్‌చార్జి నాగరాజు, రఘురాం, సుబ్బారెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఈసెట్ ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ

హిందూపురం, మే 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ఈసెట్ ఫలితాల్లో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు తెలిపారు. ఫార్మసి విభాగంలో రాష్ట్రస్థాయిలో జవేరియా తాసిన్ 4వ ర్యాంక్, పల్లవి 11, శృతి 25, 27వ ర్యాంక్ లత్రశ్రీ, లిఖిత 39, పూజిత 50, హేమప్రియ 60వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

సబ్సిడీతో రైతులకు డ్రోన్‌లు

పరిగి, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో డ్రోన్‌లను ఇవ్వనుందని మండల వ్యవసాయాధికారి విజయభారతి తెలిపారు. ఆసక్తిగల రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జనసేన సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ

పెనుకొండ, మే 17(ఆంధ్రజ్యోతి): జనసేనపార్టీ క్రియాశీలక సభ్యులకు సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం మారుతినగర్‌లోని సీతారామ కళ్యాణమండపంలో నియోజకవర్గం ఇన్‌చార్జి కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్డులను కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సురేష్, సంయుక్త కార్యదర్శులు వెంకటేశ్, శివ, ప్రోగ్రాం కమిటీ సభ్యులు వెంకటేశ్, మండల అధ్యక్షులు సంతోష్, మహేష్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

గోరంట్ల, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎండాల బండ వీధిలో నివాసముంటున్న ఈడిగ నందిని అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. ఈనెల 9న ఉదయం కుట్టు శిక్షణకు వెళ్తానని వెళ్లిన ఆమె తిరిగిరాలేదన్నారు. భర్త సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వాహనాలకు లైసెన్స్‌లు తప్పనిసరి : ఎస్ఐ

అగళి, మే 17(ఆంధ్రజ్యోతి): వాహనదారులకు లైసెన్సు, హెల్మెట్ తప్పనిసరని ఎస్ఐ వీరేష్ తెలిపారు. శనివారం అగళి మండలం కేంద్రంలో వాహనాలను తనిఖీచేశారు. ద్విచక్రవాహనదారులకు సూచనలుచేశారు.

21 నుంచి బ్రహ్మోత్సవాలు

మడకశిర రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలో చందకచర్ల ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి ప్రారంభం అవుతాయని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. 21న గణపతి హోమం, సీతారాముల కల్యాణోత్సవం ఉంటుందన్నారు. 22న హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు పెద్దఎత్తున రానున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

ఘనంగా ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెనుకొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వంశ పారంపర్య కార్యదర్శి వెచ్చం పద్మనాభయ్యగుప్త కుమారుడు వెచ్చం అమర్నాథ్ ఆధ్వర్యంలో ఆగమికులు రాజీవ్ ఆచార్యులు, మధుసుదనాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు స్వామివారి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, అర్చన, పూలంకిసేవ, మహానైవేద్యం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు అమర్నాథ్ ఇంటి నుంచి మంగళవాయిద్యాలతో అలయ ప్రవేశం, దేవతాప్రార్థన , స్వచ్ఛవాచకం, బంధన, అంకురార్పణ, కుంభారాదనం, వాస్తుహోమం, గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణ, శేషవాహనోత్సవం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రగతి శ్రీనివాసులు, సుధాకర గుప్త, యాడికి నాగరాజు, అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గోరంట్లలో తిరంగా యాత్ర

గోరంట్ల, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర శనివారం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో తిరంగ యాత్రను చేపట్టారు. భారత్ పెట్రోల్ బంక్ వద్ద నుంచి ప్రధాన రహదారిపై బస్టాండ్ కూడల వరకు ప్రదర్శన చేశారు. త్రివర్ణపతాకాలను పట్టుకుని వందేమాతరం, భారత్ మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. మృతి చెందిన మురళీనాయక్‌కు నివాళులు అర్పించి, మౌనం పాటించారు.

కియ వద్ద సినిమా షూటింగ్



షూటింగ్‌లో పాల్గొన్న హీరో వరుణ్ తేజ్

పెనుకొండ రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని కియ కార్ల పరిశ్రమ వద్ద సినిమా షూటింగ్ జరుగుతోంది. యర్రమంచి ప్లాంట్ వద్ద హీరో వరుణ్‌తేజ్ నటిస్తున్న సినిమాలోని కొన్ని సన్నివేశాలను శనివారం చిత్రీకరించారు. మూడు రోజులపాటు కియ వద్ద షూటింగ్ జరుగుతుందని తెలిసింది.

వైద్యులకూ నీటి సమస్య

సర్వసభ్య సమావేశంలో డాక్టర్ రుబినా

పరిగి, మే 17(ఆంధ్రజ్యోతి): వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నా నీటి సమస్య వేధిస్తోందని, బయటకు వెళ్లి కొళాయి ద్వారా నీటిని తెచ్చుకుంటున్నామని ఊటకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రుబినా అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సవిత అధ్యక్షతన ఎంపీడీఓ రెడ్డప్ప ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్యురాలు రుబియా సమస్యలను వివరించారు. భవనం కిటికిలు, తలుపులు, విద్యుత్, పలు సమస్యలతో సిబ్బంది సతమతం అవుతున్నారన్నారు. ప్రతిరోజూ రోగులువైద్యం కోసం వస్తే మందులు లేకపోవడంతో ఇతర ఆసుపత్రుల నుంచి తెప్పించి ఇవ్వాల్సి వస్తోందన్నారు. ఏఓ విజయభారతి మాట్లాడుతూ రైతు గుర్తింపు నమోదు, క్రాప్‌లోన్, పంటనష్టపరిహారానికి 6, 656 మంది నమోదు చేసుకున్నారన్నారు. ఎంఈఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ జూన్‌లో తల్లుల ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. పలు మండలశాఖ అధికారులు గతంలో జరిగిన, జరగబోయే పనులపై వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, జడ్పీటీసీ శ్రీరాములు, సచివాలయ ఉద్యోగులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.